ప్రపంచ దేశాలకు ఆధ్యాత్మిక నిలయం భారత్

భారత ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ దనఖడ్

కన్హాలో ముగిసిన అంతర్జాతీయ ఆధ్యాత్మిక మహోత్సవం

హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన గురువు కమలేశ్ డి పటేల్‌కు గ్లోబల్ అంబాసిడర్ అవార్డు

ధ్యానం చేస్తున్న భారత ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ దనఖడ్, ధ్యాన గురువు కమలేశ్ డి పటేల్

నందిగామ, మార్చి17: ప్రపంచ దేశాల ఆధ్యాత్మికతకు నిలయంగా భారతదేశం నిలుస్తుందని భారత ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ దనఖడ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని కన్హా శాంతి వనంలో హార్ట్‌ఫుల్‌నెస్, కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా జరిగిన అంతర్జాతీయ ఆధ్యాత్మిక మహోత్సవం ఆదివారం ముగింపు వేడుకల్లో భారత ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ దనఖడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ దనఖడ్ మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలలో అంతరించిపోతున్న వృక్ష సంపదకు శ్రీరామచంద్ర మిషన్‌లో ధ్యాన గురువు కమలేశ్ పటేల్ కన్హాలో జీవం పోసి వృక్ష సంపదను రక్షిస్తున్నారని, ఎక్కడ చూసినా సేంద్రియ, ఉద్యానవనాలు, ఔషధ మొక్కలతో ఆహ్లాదకరమైన వాతావరణం కనిందని దేశం చేస్తున్నదని నిర్వాహకులను అభినందించారు. ప్రపంచ శాంతి కోసం ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక మహోత్సవం భారత్‌లోని కన్హాలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందిన హార్ట్‌ఫుల్‌నెస్, కేంద్ర సాంస్కృతిక శాఖను అభినందించారు. కన్హా నుండి ప్రపంచానికి శాంతి సందేశం అందిందన్నారు.

దాజీకి అరుదైన గౌరవం..

ప్రపంచ శాంతి కోసం శ్రీరామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్ ధ్యాన గురువు కమలేశ్ డి పటేల్ చేస్తున్న కృషిని గుర్తించి కామన్వెల్త్ కార్యదర్శి జనగర్ ప్యాట్రిసియా స్కాట్లాండ్ కామన్వెల్త్ శాంతి బిల్డింగ్ గ్లోబల్ అంబాసిడర్ అవార్డును ఆదివారం కన్హాలో భారత ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ దనఖడ్ ఆదివారం హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన గురువు కమలేశ్ డి పటేల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కమలేశ్ పటేల్ మాట్లాడుతూ.. ఈ అవార్డు తన ఒక్కరి కృషితో రాలేదని, హార్ట్‌ఫుల్‌నెస్‌కి సహకరించిన ప్రతిఒక్కరికీ ఈ అవార్డు చెందుతుందని తెలిపారు. ఆధ్యాత్మిక మహోత్సవం విజయవంతానికి సహకరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు.

లక్షలు వెచ్చించారు..

లక్షణంగా వదిలేశారు..

- లక్షలతో మరమ్మతులు చేపట్టినా నిరుపయోగమే..
- బీఆర్ఎస్ హయాంలో రూ.15 లక్షల వరకు నిధుల మంజూరు
- బస్టాండ్‌లో బస్సులు నిలుపని వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

పెద్దేముల్ బస్టాండ్

పెద్దేముల్, మార్చి 17 : దశల వారీగా రూ.లక్షలు ఖర్చు చేసి బస్టాండ్‌ను అన్ని విధాలా పునరుద్ధరించినప్పటికీ విని యోగంలోకి తేకపోవడంతో నిరుపయోగంగా మారింది పెద్దేముల్ మండల కేంద్రంలోని బస్టాండ్ పరిస్థితి. 2000 సంవత్సరంలో ప్రస్తుత ఎమ్మెల్సీ అప్పటి తాండూరు ఎమ్మెల్యే పట్నం మహేందర్‌రెడ్డి ఈ బస్టాండ్‌ను ప్రారంభించారు. కొద్దిరోజులు బస్సులు ఆగినప్పటికీ ప్రస్తుతం మాత్రం ఉత్సవ విగ్రహంగా బస్టాండ్ మారింది. ఆర్టీసీ అధికారుల అలసత్వానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మరమ్మతులు చేపట్టినా.. వినియోగం శూన్యం

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం బస్టాండ్ మరమ్మతులకు దాదాపు రూ.12 లక్షల నుంచి 15 లక్షల వరకు నిధులు మంజూరు చేసింది. దీంతో బస్టాండ్ ప్రాంగణంలో సీసీ రోడ్డుతో పాటు ప్రహరీని నిర్మించారు. బస్సులు నిలిపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకొంటామని చెప్పారు. దాదాపు వారం రోజులపాటు ఒక హోంగార్డును నియమించి బస్సులు ఆగేలా చేశారు. అనంతరం హోంగార్డుని నిలిపివేయడంతో బస్సులు యథావిధిగా బస్టాండ్‌లోకి రాకుండా అలాగే బయట నుంచి వెళ్లిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్‌లో బస్సులు నిలుపాలని స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బస్టాండ్ ఆవరణలో ఓ నీటి సంపు తోపాటు మరమ్మతులకు రూ.లక్షన్నరకు పైగా నిధులు ఖర్చు చేసినట్లు సంబంధిత శాఖ అధికారులు తెలుపుతున్నారు.

బస్టాండ్ వెనుకభాగంలో నిర్మించిన నీటి సంపు

మరమ్మత్తులు చేసిన మరుగుదొడ్లు

బస్టాండ్‌కు సమీపంలోనే కార్యాలయాలు..

బస్టాండ్‌లోకి బస్సులు వచ్చేలా చొరవ చూపాలని ఆర్టీసీ అధికారులను ఆయా గ్రామాల ప్రజలు వేడుకొంటున్నారు. ప్రస్తుతం బస్టాండ్‌కు చుట్టూ ప్రస్తుతం ఎంపీడీవో, ఎమ్మార్వో, విద్యుత్, పశువైద్యశాల, ఈజీఎస్, ఐకేపీ, ఎమ్మార్సీ, బీసీ హాస్టల్, రైతుసేవా సహకార సంఘం, ప్రభుత్వ జూనియర్ కళాశాల కార్యాలయాలు ఉండడంతో పాటు జనావాసాలు కూడా ఎక్కువ మొత్తంలో పెరిగిపోయాయి. ప్రస్తుతం బస్సుల్లో ప్రయాణం చేసే వారి సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. ప్రయాణికులు, విద్యార్థులు, మహిళా ఉద్యోగులు, ఇతర ఉద్యోగస్తులకు ఈ బస్టాండ్ కేంద్రమే అన్ని విధాలుగా అనువైనది చెప్పవచ్చు. రాత్రి వేళలో బస్టాండ్‌లో లైట్లు లేక బస్టాండ్ అంధకారంలో ఉంది. దీంతో నూతన బస్టాండ్ తాగుబోతులకు అడ్డాగా మారుతున్నందున లైట్లను కూడా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

చర్యలు చేపడుతాం..

బస్టాండ్‌లో ప్రతి రోజూ బస్సులు నిలిపేలా వీలైనంత త్వరగా చర్యలు చేపడతాం. ఇప్పటికే బస్టాండ్‌లో మరోమారు అన్ని రకాల మరమ్మతుల పనులను చేపట్టడంతోపాటు నూతనంగా ఓ నీటి సంపును కూడా నిర్మించడం జరిగింది. త్వరలో ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి బస్టాండ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి ప్రయాణికులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటాం.

- సమత, తాండూరు ఆర్టీసీ డిపో మేనేజర్, వికారాబాద్ జిల్లా

బస్టాండ్‌ను అందుబాటులోకి తేవాలి..

బస్టాండ్‌ను వీలైనంత త్వరగా ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలి. ప్రతిసారి దశలవారీగా మరమ్మతులు చేస్తున్నారు. తదుపరి అందుబాటులోకి తీసుకొచ్చే విషయాన్ని గాలికి వదిలేస్తున్నారు. బస్టాండ్ అందుబాటులోకి వస్తే ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగస్తులకు మేలు జరుగుతుంది.

- తలారి గోపాల్, గ్రామస్తుడు, పెద్దేముల్ గ్రామం

అధికారులు చొరవ చూపాలి

ప్రయాణికుల రవాణా సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని అందరికీ మేలు జరిగేలా ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టాలి. ప్రతి రోజూ ఎంతోమంది ప్రయాణం కొనసాగిస్తుంటారు. మండల కేంద్రంలో బస్టాండ్‌ను అందుబాటులోకి తీసుకురాకపోవడం విడ్డూరం.

- బాల్‌రాజ్, విద్యార్థి, పెద్దేముల్ గ్రామం

రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా మల్‌రెడ్డిరాంరెడ్డి

ఇబ్రహీంపట్నం, మార్చి 17 : రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్‌గా ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన మల్‌రెడ్డి రాంరెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం శనివారంరాత్రి ఉత్తర్వులు జారీచేసింది. కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికకావడంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం రాంరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బషీరాబాద్ : మైల్వార్ రిజర్వు ఫారెస్ట్‌లో ఏర్పాటు చేసిన సాసర్ పిట్‌లో నీటిని నింపుతున్న సిబ్బంది

వన్య ప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

దప్పికను తీర్చడానికే సాసర్ పిట్ల ఏర్పాటు

పెద్దేముల్, మార్చి 17 : వేసవి కాలంలో వన్య ప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నాగులపల్లి రిజర్వ్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ భాగ్యమ్మ తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని నాగులపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లోని తట్టేపల్లి సెక్షన్‌లో 3 సాసర్ పిట్లను నీటితో నింపారు. ఈ సందర్భంగా నాగులపల్లి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ భాగ్యమ్మ మాట్లాడుతూ ఎండాకాలం దృష్ట్యా వన్య ప్రాణుల సంరక్షణలో భాగంగా వాటి దప్పికను తీర్చడానికి తట్టేపల్లి సెక్షన్‌లో మూడు సాసర్ పిట్లలో జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్, తాండూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్యాంసుందర్ రావు ఆదేశాల మేరకు నీటిని నింపడం జరిగిందన్నారు. ఈ ప్రక్రియను జూన్ నెల వరకు కొనసాగించి ప్రతి రెండు రోజులకొకసారి నీటితో నింపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.

మైల్వార్ అటవీలో తాగునీరు ఏర్పాటు

బషీరాబాద్ : మైల్వార్ రిజర్వు ఫారెస్ట్‌లోని అటవీ జంతువుల కోసం తాగు నీటిని ఏర్పాటు చేయడం జరిగిందని తాండూరు అటవీ శాఖ అధికారి శ్యామ్ సుందర్‌రావు ఆదివారం తెలిపారు. ఎండలు ఎక్కువ కావడంతో అటవీలో ఉన్న జంతువులు తాగు నీటి కోసం ఇబ్బందులు పడకుండా ఉండేందుకు సాసర్ పిట్లలో ట్యాంకర్ల ద్వారా నీటిని నింపడం జరిగిందన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ఎన్నికల కోడ్‌ను విధిగా పాటించాలి

కొడంగల్, మార్చి 17: పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని, నిబంధనలు ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో ఆల్ పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని, ఎటువంటి పార్టీల సమావేశాలు, ధర్నాలు వంటి వాటిని నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పార్టీలకు సంబంధించి ఏ కార్యక్రమైనా అధికారుల పర్మిషన్ తప్పకుండా తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా రూ.50వేలకు మించి నగదు ఉంటే అనుమతులకు సంబంధించిన రసీదు పొందాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్ని పార్టీల నాయకులు రమేశ్ బాబు, మోహన్‌రావు, కృష్ణంరాజు, గౌసన్, ఇందనూర్ బషీర్‌లతో పాటు తహసీల్దార్ విజయ్‌కుమార్, సిబ్బంది మహేశ్, శృతి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్, మార్చి 17 : జిల్లాలో పార్లమెంటు ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా రాజకీయ ప్రజా ప్రతినిధులు సహకరించాలని వికారాబాద్ జిల్లా అదనప కలెక్టర్ రాహుల్ శర్మ కోరారు. ఆదివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఎన్నికల నియమావళి అమలు, విధివిధానాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్లమెంటు ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీ ప్రతినిధులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు వీలుగా సహకరించాలన్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అనుసరించి ఎన్నికలు సాఫీగా, సజావుగా జరిగేలా సహకరించాలన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘనకు పాల్పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని ఆయన అన్నారు. పార్టీలు గానీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, పార్టీలు అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేసి ఎన్నికల నిబంధనల ఉల్లంఘనను పాల్పడకూడదని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక సౌకర్యాలను సమకూర్చుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో వికారాబాద్ డిప్యూటీ తాహసిల్దార్ రాజేందర్‌రెడ్డి, బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఎం ప్రతినిధులతో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

రైతన్నలకు పశుగ్రాసం కష్టాలు

వరికోత యంత్రాలతో చేతికి అందని వరిగడ్డి

ట్రాక్టర్ గడ్డి రూ.10 వేల నుంచి 12 వేలు పలుకుతున్న పశుగ్రాసం

కొనుగోలు చేసిన పశుగ్రాసాన్ని ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న రైతులు

మొయినాబాద్, మార్చి 17 : ఆరుగాలం కష్టించి పండించిన రైతన్నకు పశుగ్రాసం కష్టాలు తప్పడం లేదు. యంత్రాలతో వరి కోతలు చేస్తుండడంతో పంట మాత్రమే చేతికి వస్తున్నది. మారుతున్న కాలాన్ని బట్టి రైతులు సాగు విషయం లో సులభ పద్ధతులను అనుసరిస్తున్నారు. మండలంలో 5,956 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. రైతులు వరి కోతల సమయంలో యంత్రాలను వినియోగిస్తుండడంతో వరి గడ్డి చేతికి రాకపోవడంతో పశుగ్రాసం విషయంలో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో కూలీలు చేతితో వరి కోసినప్పుడు వడ్లతో పాటు గడ్డి కూడా వచ్చేది. కూలీలతో ఎకరా వరి పంటను కోయిస్తే రూ.పది వేల వరకు ఖర్చుఅవుతుండగా.. హార్వేస్టర్ల వినియోగంతో ఎకరాని కి రూ.5 వేలతోనే వరి ధాన్యం ఇంటికి చేరుతున్నది. కూలీల కొరత ఇతర కారణాలతో చాలామంది అన్నదాతలు యంత్రాలవైపు మొగ్గు చూపుతున్నారు.

ట్రాక్టర్ ధర రూ.10 వేల నుంచి 12 వేలు

ట్రాక్టర్ ధర రూ.10 వేల నుంచి 12 వేలు పలుకుతుండడంతో రైతులు పాడి పశువులను పోషించేందుకు కష్టాలు పడుతున్నారు. ఎంత ఖర్చయినా పశుగ్రా సం కొనక తప్పడం లేదు. చేవెళ్ల డివిజన్‌లో వరి సాగు చాలా వరకు తగ్గడంతో పశుగ్రాసం కొరత ఏర్పడుతున్నది. చేవెళ్ల డివిజన్ హైదరాబాద్ నగరానికి అతి సమీపంలో ఉండడం ...రియల్ వ్యాపారం బాగా ఉండి వ్యవసాయ భూములు అమ్ముడుపోయాయి. దీంతో వరి సాగు చాలా వరకు తగ్గింది. పంటల సాగు తగ్గడం పక్కన పెడితే చాలావరకు రైతులు పాడి పరిశ్రమను ఏర్పాటు చేసుకుంటున్నారు. కానీ పశువులకు కావాల్సిన పశుగ్రాసం కొరతతో ఇబ్బంది పడుతున్నారు. చేవెళ్ల డివిజన్‌లోని నవాబుపేట, షాబాద్ మండలాల్లో మాత్రమే కొంత మేర వరి సాగు అవుతున్నది. చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి మండలాల్లో వరి సాగు చాలా వరకు తగ్గింది. దీంతో వరిగడ్డిని బయటి నుంచి కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొందరు రైతులు యంత్రాలతో కోసిన గడ్డిని యంత్రాలతోనే కట్టలుగా కట్టిస్తున్నారు. ఆ గడ్డిని అన్నదాతలు కొనుగోలు చేసి పశువులకు వినియోగిస్తున్నారు. పశుగ్రాసం కొరత లేకుండా ప్రభుత్వం సబ్సిడీపై దాణాను సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు. గతేడాది వర్షాలు తక్కువగా కురియడంతో భూగర్భజలాలు రోజురోజుకూ అడుగంటుతున్నాయి. ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో భూమిపై గడ్డి పోస కూడ కనిపించడం లేదు. ఈ పరిస్థితుల్లో పశువులు మేత కోసం చెత్తకుప్పలు, డంపింగ్ యార్డుల్లోని ప్లాస్టిక్ కవర్లు, కుళ్లిపోయిన ఆహార పదార్థాలను తింటున్నాయి. ప్రభుత్వం పశుగ్రాసం కొరతను తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, మార్చి 17 : వికారాబాద్ జిల్లాలో 10వ తరగతి వార్షిక పరీక్షలు జరుగనున్న పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ కోటిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షా కేంద్రాల లోపలికి సెల్‌ఫోన్ అనుమతి లేదన్నారు. పరిసర ప్రాంతాల్లో ఉన్న జిరాక్స్ కేంద్రాలు పరీక్ష సమయంలో మూసివేయాలన్నారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలన్నారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, ట్రాఫిక్ ఇబ్బందులు కలిగితే డయల్ 100కు కాల్ చేసి పోలీస్ అధికారులకు తెలియజేయాలని సూచించారు.

కల్వర్టును ఢీకొన్న కారు

ఏఆర్ కానిస్టేబుల్ మృతి.. మరో ముగ్గురికి గాయాలు

కృష్ణకుమార్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి (ఇన్‌సెట్‌లో ఘటనా స్థలం)

వికారాబాద్, మార్చి 17 : ఆర్‌అండ్‌బీ కల్వర్టును కారు ఢీకొన్న ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ మృతి చెందగా.. మరో ముగ్గురు పోలీసులు గాయపడిన ఘటన వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. వికారాబాద్ సీఐ నాగరాజు, స్థానికులు తెలిపిన ప్రకారం.. నలుగురు ఏఆర్ కానిస్టేబుళ్లు శంకర్‌పల్లి నుంచి వికారాబాద్‌కు టీఎస్34 టీఏ4983 నంబర్ గల కారులో వస్తున్నారు. వికారాబాద్ మండలంలోని పులుసుమామిడి సమీపంలోని ఆర్‌అండ్‌బీ కల్వర్టును వారు ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ కృష్ణకుమార్ అక్కడికక్కడే మృతి చెందగా.. మిగిలిన ముగ్గురికి గాయాలయ్యాయి. కృష్ణకుమార్ మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్పీ కోటిరెడ్డి ప్రభుత్వ దవాఖానకు వచ్చి కృష్ణకుమార్ భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

పర్యావరణ హిత ప్రజా రవాణా

ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణే లక్ష్యంగా హెచ్ఎండీఏ కసరత్తు

సిటీబ్యూరో, మార్చి 17 (నమస్తే తెలంగాణ): విశ్వనగరంగా విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగరంలో మెరుగైన ప్రజా రవాణా వ్యవస్థలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) చర్యలు చేపట్టింది. ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణే లక్ష్యంగా పనిచేస్తున్న హెచ్ఎండీఏ భవిష్యత్ ప్రజా రవాణా వ్యవస్థలపైనా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ(ఉమ్టా) పనిచేస్తోంది. పబ్లిక్ ట్రాన్స్‌పోర్టేషన్ రంగంలో విశేష అనుభవం ఉన్న వారిని నియమించి మెట్రోపాలిటన్ ప్రాంతానికి సమర్థవంతమైన ప్రజా రవాణా వ్యవస్థలు ఉండేలా క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేయనున్నారు. ఇందుకోసం కొత్తగా ఢిల్లీలో పనిచేస్తున్న ఓ ఉన్నతాధికారిని ఉమ్టా డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. గ్రేటర్ చుట్టూ నగరం నలుమూలా విస్తరిస్తున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల ప్రాధాన్యత, జన సాంద్రతను పరిగణలోకి తీసుకొని ఆధునిక ప్రజా రవాణా వ్యవస్థలను తీసుకొచ్చేందుకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ సంస్థలు చేపట్టే ట్రాఫిక్ అధ్యయనమే కాకుండా వివిధ ఏజెన్సీలు ట్రాఫిక్, రవాణా చర్యలపై రూపొందించిన నివేదికలను సమగ్రంగా పరిశీలించి ఒక సమగ్ర పట్టణ రవాణా వ్యవస్థను రూపొందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

ఆధునిక ప్రజా రవాణా వ్యవస్థలకు ప్రాధాన్యం...

ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దడంపై ప్రధానంగా దృష్టి సారించింది. ట్రాఫిక్ సమస్యలు లేకుండా పర్యావరణ హిత ప్రజా రవాణా వ్యవస్థలే లక్ష్యంగా ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందిస్తున్నది. పట్టణ ప్రాంతాల్లో మోటారు వాహనాలు పెరగడం వల్ల వచ్చే వాయు కాలుష్యాన్ని తగ్గిస్తూ, ఆధునిక ప్రజా రవాణా వ్యవస్థలను రూపొందించడమే లక్ష్యంగా పెట్టుకొని పని చేస్తున్నారు. ఇప్పటికే నగరంలో మెట్రో రైలు అందుబాటులో ఉండగా, కొత్తగా పెద్ద మొత్తంలో విద్యుత్ వాహనాల వినియోగాన్ని పెంచేలా ప్రోత్సహకాలు ఇస్తున్నారు. భవిష్యత్ ట్రాఫిక్ అవసరాలు ఏ విధంగా ఉంటాయో అంచనా వేసేందుకు క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించాల్సి ఉంటుందని, హెచ్ఎండీఏ పరిధిలో మెరుగైన, ఆధునిక రవాణా వ్యవస్థల రూపకల్పన చేయడమే లక్ష్యంగా ఉమ్టా పని చేస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.

టీ హబ్‌లో 'స్టార్టప్ మహాకుటుంబ్'

సిటీబ్యూరో, మార్చి 17 (నమస్తే తెలంగాణ): అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సరికొత్త ఆలోచనలతో స్టార్టప్‌లను ప్రారంభించిన ఔత్సాహిక వ్యాపారవేత్తలను ప్రోత్సహించేందుకు టీ హబ్ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టిందని నిర్వాహకులు తెలిపారు. స్టార్టప్ మహాకుటుంబ్-2024 పేరుతో నిర్వహించే ఈ కార్యక్రమంలో వివిధ రంగాల్లో ఏర్పాటు చేసిన స్టార్టప్‌లను ఒకే వేదికపైకి తీసుకొచ్చి వారికి అవసరమైన మద్దతు, ఆర్థిక సహకారం అందిస్తామన్నారు. ఇప్పటికే టీ హబ్ కేంద్రంగా స్టార్టప్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపెనీలతో పాటు ఇతర స్టార్టప్‌లను ప్రోత్రహించేందుకు స్టార్టప్ మహాకుటుంబ్ -2024 కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. కాగా, కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అటల్ ఇన్నోవేషన్ సెంటర్‌తో మొబిలిటీ స్టార్టప్‌లకు ప్రోత్సాహించేందుకు మూడో విడుత కార్యక్రమాన్ని టీ హబ్‌లో నిర్వహిస్తున్నామని నిర్వాహకులు వెల్లడించారు. పట్టణ ప్రాంతాల్లో ప్రజా రవాణా వ్యవస్థలో మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. సరికొత్త ఆలోచనలతో స్టార్టప్‌లను ఏర్పాటు చేసి ప్రారంభ దశలో ఉన్న వారికి అసవరమైన సహకారం అందించేందుకు మొబిలిటీ కోహర్ట్-3ని నిర్వహిస్తున్నామన్నారు.

ఈ నెలాఖరులోగా ఇంటి పన్నులు చెల్లించాలి

పూడూరు, మార్చి 17: ఇంటి పన్ను ఈ నెల 31లోపు చెల్లించి, పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ మల్లేశం తెలిపారు. పూడూరు మండల పరిధిలోని 31గ్రామ పంచాయతీల్లో అధికారులు ఇంటి పన్నులను వసూలు చేస్తున్నారని తెలిపారు. గ్రామాల పరిధిలోని వ్యవసాయ క్షేత్రాల్లో నిర్మిస్తున్న గృహాలకు సైతం పంచాయతీ నుంచి అనుమతులు పొందాలన్నారు. ప్రజలు చెల్లించిన డబ్బులతోనే గ్రామ పంచాయతీలోని చిన్నచిన్న సమస్యలు ఉంటే పంచాయతీ కార్యదర్శులు పరిష్కరిస్తారని తెలిపారు. ప్రతి గ్రామాల్లో రూ.5లక్షల నుంచి రూ.10లక్షలతో మురుగు కాల్వలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు జరిగినట్లు వివరించారు.

రేపు గోశాలలో దశాబ్ది ఉత్సవాలు

తాండూరు, మార్చి 17: తాండూరు పట్టణంలోని గోశాలలో ఈ నెల19న దశాబ్ది ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు గోశాల అధ్యక్షుడు పట్లోళ్ల బాల్‌రెడ్డి తెలిపారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మంగళ వారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఆదర్శతులసీనగర్ పార్కులో చాగంటి కోటేశ్వర్‌రావు ప్రవచనాలు ఉంటాయని తెలిపారు.